నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | శుక్రవారం 4 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

### కూల్చివేతలు సరికాదు



దుకాణాలను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. పండుగవేళ దుకాణాల్లోకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికే వ్యాపారులు గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారిపై ప్రతాపం చూపిస్తున్నారు. ప్రజలు, వ్యాపారులు ఆలోచించాలి. అడ్డువస్తే, ఎదురు మాట్లాడితే తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇది ప్రజాపాలన ప్రభుత్వం కాదు. రాష్ట్రంలో, దేశంలో ఎంతో మంది నాయకులను చూశాం. కానీ మంచిర్యాలకు ఇలాంటి వ్యక్తిరావడం, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే మనిషి రావడం బాధాకరం. అందరూ ఆలోచించాలి. ఎంతటి పగవాడికైనా ఇలాంటి బాధ రావద్దు.

**- నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే**



ఎల్కపల్లిలో కప్పతల్లిని ఊరేగిస్తున్న గ్రామస్తులు



దహెగాంలో జలాభిషేకానికి వెళ్తున్న గ్రామస్తులు

## వరుణ దేవా కరుణించు

- వర్షాల కోసం ప్రత్యేక పూజలు

దహెగాం/పెంచికల్‌పేట్, అక్టోబర్ 3 : దహెగాం మండల కేంద్రంతో పాటు చౌక, పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామస్తులు గురువారం వర్షాల కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ,రేణుకెల్లమ్మ, భీమన్నదేవతలకు జలాభిషేకం చేశారు. డప్పు చప్పుళ్ల నడుమ కప్పతల్లిని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. పంటలు ఎండిపోతున్నాయని.. వరుణ దేవా.. కరుణించు అంటూ వేడుకున్నారు.



జేసీబీతో స్లాబును కూలుస్తున్న అధికారులు

# పండుగపూట పొట్ట గొడుతారా..?

- ఆక్రమణల పేరిట షాపులు కూలగొట్టి గిరాకీ రాకుండా చేసిన్రు
- మంచిర్యాల మార్కెట్ ఏరియా వ్యాపారుల ఆవేదన

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 3 : 'ఆక్రమణల పేరిట మా షాపుల ముందున్న రేకుల షెడ్లు, స్లాబులు తదితర వాటిని కూల్చివేస్తున్నరు. కొనేటోళ్లను షాపుల్లోకి రాకుంట చేసిన్రు. గీ దసరాకే నాలుగు రూపాలు దొరుకుతాయే.. ఇంకొన్ని రోజులు ఆగితే అయిపోవు కదా. పండుగ పూట మా పొట్టగొడుతారా' అంటూ మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మార్కెట్ ఏరియాలోగల ఆక్రమణలను మున్సిపల్ అధికారులు, సిబ్బంది తొలగించారు. ఉదయం నుంచి మొదలైన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ సాయంత్రం దాకా కొనసాగింది. మార్కెట్ ఏరియాలోని వ్యాపారులు చాలా వరకు తమ దుకాణాల గదులను వదిలి.. ముందుకు రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. దుకాణాల ముందు రేకుల షెడ్లు, స్లాబులు వేయడం, తోపుడుబండ్లను ఏర్పాటు చేయడం వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడుతుంది. మార్కెట్ రోడ్డులో వ్యాపారులు ఇరుపక్కలా ముందుకు రావడంతో రోడ్డు ఇరుకుగా మారిపోయింది. దీనికి తోడు రోడ్డుకు మధ్యలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే ఆక్రమణల తొలగింపు ఒక్కటే మార్గమని భావించిన అధికారులు ముందస్తుగా వ్యాపారులకు సమాచారం అందించారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో మున్సిపల్ అధికారులు జేసీబీ సాయంతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. పలుచోట్ల వ్యాపారులు వారికి వారే ముందుకు నిర్మించిన ఆక్రమణలను తొలగించారు. కాగా, దసరా పండుగ వేళ ఇలా కూల్చివేతలు చేపట్టడం సరికాదని, ఇంకొంత సమయం ఇస్తే బాగుండేదని వ్యాపారులు ఆవేదన.. అసహనం వ్యక్తం చేశారు.

**పరిశీలించిన ఎమ్మెల్యే పీఎస్సార్**

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : మార్కెట్‌లో చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చి వేతలను ఎమ్మెల్యే పీఎస్సార్ పరిశీలించారు. వ్యాపారస్తులతో మాట్లాడారు. మున్సిపల్ శాఖ అధికారులు, పోలీసులకు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, వ్యాపారస్తులు ఉన్నారు.

### వ్యాపారుల పొట్టగొట్టడమే

*మంచిర్యాల (ఏసీసీ), సెప్టెంబర్ 22 : రాత్రికి రాత్రే మార్కింగులు చేసి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వ్యాపార సముదాయాలను కూల్చడం సరికాదు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా కూల్చి వేతలు చేపట్టడం అంటే వ్యాపారస్తుల పొట్టకొట్టడమే అవుతుంది. మార్కెట్ ఏరియాలో పేద, మధ్యతరగతి కుటుంబాలు జీవనోపాధి పొందుతుంటే అక్రమ కట్టడాల పేరిట కూల్చివేతలు చేపట్టడం సరికాదు. ఇది శాడిస్టు తనమే అవుతుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటేయలేదని వ్యాపారస్తులను టార్గెట్ చేయడం మూర్ఖత్వమే.*

**- రఘునాథ వెరబెల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

## ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 3 : ఆర్థిక మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-హైదరాబాద్ ఏజీఎం రాధిక భరత్‌తో కలిసి అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు ఆర్థిక మోసాలు, నగదురహిత లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు, పిన్ నంబర్ వివరాలు తెలుపకూడదన్నారు. ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేసే సమయంలో లబ్ధిదారుల వివరాలు సరిచూసుకొని పంపించాలని, పాస్ వర్డ్, ఓటీపీ వివరాలు ఇతరులకు చెప్పకూడదని తెలిపారు. ఆర్థిక మోసానికి గురయితే వెంటనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టోల్ ఫ్రీ నంబర్ 1930లో తెలియజేయాలని, సమీప బ్యాంకుకు వెళ్లి వెంటనే ఫిర్యాదు చేయవచ్చన్నారు. గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఆర్థిక మోసాలపై ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# కూల్చివేత ఎందుకో..!?

**కొత్త హాస్పిటల్ నిర్మాణం పేరిట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ కూల్చివేతను ప్రారంభించిన ఎమ్మెల్యే పీఎస్సార్**

*మంచిర్యాల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయాల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను అధికార పార్టీ నేలమట్టం చేయడం విమర్శలకు తావిస్తున్నది. మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు పేరిట నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ బిల్డింగ్ కూల్చివేతను స్వయంగా ఎమ్మెల్యే పీఎస్సార్ ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమవుతున్నది. ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రజాధనం వృథా చేయడమేమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది.*

- అనుమతుల్లేకుండానే నేలమట్టం చేస్తున్న తీరుపై విమర్శలు
- త్వరలో ఆర్‌అండ్‌బీ భవనాలకు ఎసరు
- వృథాకానున్న రూ. పదికోట్ల ప్రజాధనం
- కూల్చివేతకు కొబ్బరికాయలు కొట్టడమేమిటంటున్న ప్రజలు
- అధికార పార్టీ తీరుపై ఆగ్రహం
- పూర్తిగా కక్షసాధింపు చర్యే : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### ప్రజాధనం వృథా



మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చివేస్తున్న జేసీబీ

మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో 4.22 ఎకరాలను కొత్త హాస్పిటల్ కోసం కేటాయించారు. ఆర్‌అండ్‌బీ శాఖ, మున్సిపల్ శాఖ స్థలాన్ని టీఎస్‌ఎంఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు అప్పగిస్తున్నట్లు లెటర్లు సైతం ఇచ్చాయి. జిల్లా అధికారుల నుంచి లెటర్లు వచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదని తెలిసింది. వైద్యారోగ్యశాఖలో పని చేసే ఓ అధికారే.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాలు రాలేదని చెప్పడం గమనార్హం. మరి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్‌ను కూల్చేందుకైనా పర్మిషన్ ఉందా అంటే.. అదీ లేదనే తెలుస్తున్నది. మున్సిపాలిటీ ఫండ్స్‌తో నిర్మించిన ఈ భవనాన్ని కూల్చాలంటే మున్సిపల్‌లో తీర్మానం చేసి, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఇక్కడ అలాంటిదేమీ లేకుండానే ఇష్టారాజ్యంగా కూల్చివేశారు. ఈ విషయంపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను వివరణ కోరగా.. కూల్చివేతల విషయం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లే చూసుకుంటున్నారన్నారు. మాకు ఈ విషయంలో సంబంధం లేదన్నారు. కూల్చివేత పర్మిషన్లు కూడా వాళ్లే తీసుకుంటారంటూ దాటవేసే ధోరణితో సమాధానం చెప్పారు.

**రూ.10 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం**



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేత కోసం కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే పీఎస్సార్

గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.7.20 కోట్లు కేటాయించింది. ఎంఏయూడీ నుంచి రూ.4.50 కోట్లు, మున్సిపాలిటీ నుంచి రూ.2.70 కోట్లు మంజూరు చేశారు. దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే పనులు పూర్తయ్యాయి. దీంతో పాటు గతేడాదే రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, రూ.3 కోట్లు విలువ చేసే పాత ఆర్‌అండ్‌బీ ఆఫీస్ కార్యాలయాలు సైతం కూల్చివేయనున్నట్లు తెలిసింది. ఈ లెక్కన రూ.10 కోట్ల విలువ చేసే ఆస్తుల విధ్వంసానికి తెరలేపినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం జీజీహెచ్ (గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్)కోసం కాలేజీ రోడ్‌లోని మార్కెట్ యార్డు స్థలంలో 450 పడకల హాస్పిటల్ నిర్మిస్తున్నారు. అక్కడ మొత్తం 11 ఎకరాలుండగా, 4 ఎకరాల్లో నిర్మాణం జరుగుతుంది. ఇది వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నాటిని పూర్త అవుతుంది. అప్పుడు ప్రస్తుతం మెడికల్ కాలేజీగా ఉన్న షెడ్లు సైతం ఖాళీ అవుతాయి. ఇక్కడ మరో 5 ఎకరాలు అందుబాటులో ఉంటుంది. అంతగా కావాలంటే అక్కడ ఈ హాస్పిటల్‌ను నిర్మించవచ్చు. అలా చేస్తే మంచిర్యాలలో ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ జీజీహెచ్‌కు, ఎంసీహెచ్(మాతాశిశు హాస్పిటల్)పై అనుసంధానం చేయొచ్చు. కానీ ఇప్పుడు ఇక్కడే దవాఖాన నిర్మిస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే పీఎస్సార్ పట్టుపట్టడంపై జనాలు మండిపడుతున్నారు. ఎవరి కోసం ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. దవాఖాన నిర్మిస్తే మంచిదే కానీ.. ఉన్న బిల్డింగ్‌ను కూల్చివేసేందుకు కొబ్బరికాయలు (101 కొబ్బరికాయలు) కొట్టడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. ఏదైనా అభివృద్ధి పని ప్రారంభించే ముందు కొబ్బరికాయలు కొడుతారు, కానీ దానికి విరుద్ధంగా బిల్డింగ్ కూలకొడుతూ కొబ్బరికాయలు కొట్టి ఆనందపడడంపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పూర్తిగా కక్షసాధింపు చర్యే : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

ఇది పూర్తిగా కక్ష సాధింపు చర్యే. ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను కూల్చివేసేందుకు సర్కారు ఎలా అనుమతించింది. ప్రస్తుత జీజీహెచ్‌ను 450 పడకల దవాఖానలోకి మార్చి, ఏరియా హాస్పిటల్, ఎంసీహెచ్‌ను షిఫ్ట్ చేస్తారు. అలాంటప్పుడు ఇది కూల్చి కట్టాల్సిన అవసరం ఏమిటో అర్థం కావడం లేదు.. పాత హాస్పిటల్ స్థానంలో కొత్తది కూడా కట్టొచ్చు. ఆ దిశగా ఆలోచన చేస్తే ఇంత విధ్వంసం అవసరముండదు కదా. ఎన్నికలకు ముందు కూలకొడుతా అన్న మాటకు కట్టుబడి, దాదాపు రూ.10కోట్ల ఆస్తి నష్టం చేశారనే విషయాన్ని ప్రజలు గమనించాలి. ఎమ్మెల్యే మాట నిలబెట్టుకోవడానికి ఇలాంటి చర్యలకు దిగడం సరికాదు. లక్షా యాభై వేల జనాభా ఉన్న పట్టణానికి మరో మార్కెట్ అయితే అవసరం ఉంది. ఈ కూల్చివేసిన దాని స్థానంలో కొత్తది ఎక్కడ కడతారో ప్రజలకు సమాధానం చెప్పాలి.

# 'డిజిటల్' సర్వే షురూ..

- మున్సిపాలిటీల్లోని రెండు వార్డులు, రెండు గ్రామాల ఎంపిక
- ఈ నెల 7లోగా పూర్తి చేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు
- త్వరలో ప్రతి కుటుంబానికి కార్డులు



డిజిటల్ సర్వేలో భాగంగా సిర్పూర్-టీ మండలం వెంకట్రావ్‌పేట్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారుల బృందాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ) : గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఉన్నట్లే ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు అందించేందుకు సర్కారు కసరత్తు మొదలు పెట్టింది.. ఈ మేరకు జిల్లాలో గురువారం నుంచి సర్వే ప్రారంభించింది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు, కెరమెరి మండలంలోని ధనోరా గ్రామం, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని 14వ వార్డు, సిర్పూర్-టీ మండలంలోని వెంకట్రావ్‌పేట్‌లో సర్వే మొదలైంది. ఒక్కోచోట మూడు బృందాలను నియమించగా, ప్రతి రోజూ ఒక్కో బృందం 30 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంటుంది. ఈనెల 7వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. సుమారు 15 కుటుంబాలను సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**డిజిటల్ కార్డు ఆధారంగానే..**

ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఇతర సేవలు డిజిటల్ కార్డు ఆధారంగానే అమలు కానున్నాయి. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని 3వ వార్డులో సర్వే కోసం 3 టీంలు, కెరమెరి మండవలం ధనోరాలో 2 టీంలు, కాగజ్‌నగర్ మున్సిపాటీలోని 14 వార్డులో 3 బృందాలు, సిర్పూర్(టీ) మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామంలో మూడు బృందాలు సర్వే చేపట్టనున్నాయి. ఈ సర్వేలో కుటుంబ సభ్యులందరికీ కలిపి ఒక డిజిటల్ నంబరు ఇవ్వనున్నారు. అలాగే కుటుంబంలోని సభ్యులందరికీ ఒక్కొక్కరికీ ఒక్కో డిజిటల్ నంబరు కేటాయిస్తారు. వ్యక్తిగత నంబరులో పూర్తి వివరాలు పొందుపరుస్తారు.

**మార్పులు.. చేర్పులు**

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఇప్పటికే వివిధ రకాల గుర్తింపు కార్డులున్నాయి. ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు ఇలా అన్ని వివరాలను కలిపి ఒక్కటే డిజిటల్ కార్డును ప్రభుత్వం జారీ చేయనున్నది. రేషన్ కార్డు, పింఛన్లు, స్వయం సహాయక సంఘాల రుణాలు, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర వివరాల డేటా ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్నందున వాటిని నిర్ధారించుకుంటారు. కుటుంబంలో ఎవరైనా మరణించి ఉంటే వారి పేరును తొలగిస్తారు. కుటుంబాలు వేరుపడినా, వారి ఇళ్లలో పుట్టిన పిల్లల వివరాలను నమోదు చేసుకుంటారు. సర్వేకు వచ్చే బృందాలకు ఆధార్ కార్డుతో సహా కుటుంబ సభ్యులు వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు లేకుంటా ఇతర ఏదైనా గుర్తింపు కార్డు ఇస్తే సరిపోతుంది. ఒక వ్యక్తి రెండు కుటుంబాల్లో సభ్యులుగా ఉండకూడదని అధికారులు చెబుతున్నారు. చనిపోయిన వారి తొలగించటం, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి వివరాలు మార్పులు.. చేయడం.. కొత్తవారివి నమోదు చేయడంతో పాటు ప్రజలు అందించే కొత్త సమాచారాన్ని అప్‌డేట్ చేస్తారు.

## శనిగకుంట మత్తడి ధ్వంసం కేసులో

# మరో ఏడుగురు అరెస్టు

- పరారీలో ముగ్గురు నిందితులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్
- ఊహించనట్లుగానే అధికార పార్టీ నాయకులను తప్పించిన వైనం
- సింగరేణి బాంబులా? బయటివా? స్పష్టత కరువు..



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్



పోలీసుల అదుపులో నిందితులు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 3 : చెన్నూర్‌లోని శనిగకుంట చెరువు మత్తడి ధ్వంసం చేసిన నేరస్తులకు సహకరించిన మరో ఏడుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు చెన్నూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంచిర్యాల డీసీపీ భాస్కర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మత్తడి ధ్వంసం చేశారని గతంలో పెండ్యాల లక్ష్మీనారాయణ (లక్ష్మణ్ ఏ1), భీం మధూకర్ (ఏ2), రసమల్ల శ్రీనివాస్ (ఏ3), గోగుల దానయ్య (ఏ4)ను గతంలోనే అరెస్టు చేశారు. కాగా, నేరస్తులకు సహకరించారని నడిపెల్లి లక్ష్మణ్ రావు (ఏ7), మంచాల రాజబాపు (ఏ8), పెద్దింటి శ్రీనివాస్ (ఏ9), లక్కం రాజబాపు (ఏ10), పోగుల శేఖర్(ఏ11), ఇప్ప సంపత్ (ఏ12), ఉమేశ్ గిల్డా (ఏ13)లను ప్రస్తుతం (గురువారం) అరెస్టు చేశారు. కాగా, బత్తుల సమ్మయ్య (ఏ5), రాంలాల్ గిల్డా(ఏ6), ఎన్నం బానయ్య (ఏ14)లు పరారీలో ఉన్నట్లు డీసీపీ పేర్కొన్నారు. శనిగకుంటకు ఆనుకొని ఉన్న 15.20 ఎకరాల భూమిని 10 మంది గ్రూపుగా ఏర్పడి గోదావరిఖనికి చెందిన చెరుకు బుచ్చిరెడ్డి వద్ద కొనుగోలు చేసి, మళ్లీ వీరు 25.02,2022న చెన్నూర్‌కు చెందిన గొడిసెల బాపురెడ్డికి అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాపురెడ్డి వారికి రూ.నాలుగు కోట్లు చెల్లించారు. అప్పుడు కేవలం 4.20 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యింది. మిగిలిన 11 ఎకరాలు చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉండడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. చెరువు నిండి అతడి భూమిలోకి నీరు వస్తుందని చెరువు వైపు మట్టి పోయించడంతో ఇండ్లకు ముంపు సమస్య పెరిగింది. యేటా వానకాలంలో తన భూమిలోకి నీరు వస్తున్నదని, తనకు భూమి వద్దని, డబ్బులు వాపస్ ఇవ్వాలని బాపురెడ్డి భూమి అమ్మిన వ్యక్తులను ఒత్తిడి చేశాడు. దీంతో బత్తుల సమ్మయ్య ఆధ్వర్యంలో సదరు భూమికి చెందిన పలువురు కలిసి రూ.4 లక్షలు ఇస్తామని మత్తడి ధ్వంసం చేయాలని, సమస్య రాకుండా చూస్తామని, కాలనీలోకి నీరు కూడా రాదని ప్రోత్సహించారు. దీంతో పెండ్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న మత్తడిని ధ్వం సం చేశారు. నేరం జరిగే ఒకరోజు ముందు రాంలాల్ గిల్డా, 13న భీం మధూకర్‌తో బ త్తుల సమ్మయ్య మాట్లాడినట్లు కాల్ డాటాలో వెల్లడైందని తెలిపారు. దీంతో 3న గురువారం మంచాల రాజబాపు, నడిపెల్లి లక్ష్మణ్ రావు, లక్కం రాజబాపు, పెద్దింటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఇప్ప సంపత్, ఉమేశ్ గిల్డాలను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన నేరస్తులు బత్తుల సమ్మయ్య, రాంలాల్ గిల్డా, ఎన్నం బానయ్యలు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఏసీపీ ఏ.వెంకటేశ్వర్, ఎస్‌ఐ శ్వేత ఉన్నారు.

**బ్లాస్టింగ్ సామగ్రి ఎక్కడిది?**

మత్తడి ధ్వంసం కేసుకు సంబంధించి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ బుధవారం ఒక వీడియో విడుదల చేశారు. ఇందు లో సింగరేణికి చెందిన పేలుడు పదార్థాలు వినియోగించినట్లు తెలిపారు. కాగా, పోలీసులు మాత్రమే నల్గొండ జిల్లా చిట్యాల నుంచి జిలెటిన్ స్టిక్స్ తీసుకొచ్చారని చెబుతున్నారు. ఎమ్మెల్యేకు, పోలీసులు చెప్పే విషయానికి పొంతన లేకపోవడంతో ప్రజలు విస్మయం చెందుతున్నారు. చిట్యాల నుంచి తెప్పిస్తే, అక్కడ వీరికి అమ్మిన వారిని అదుపులోకి తీసుకున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**'నమస్తే తెలంగాణ' చెప్పిందే నిజమైంది**

మత్తడి ధ్వంసం కేసులో అధికార పార్టీకి చెందిన కీలక వ్యక్తిని కేసు నుంచి తప్పించే అవకాశాలున్నాయని మొదటి నుంచి 'నమస్తే తెలంగాణ' కథనాలు ప్రచురించింది. గురువారం వెల్లడించిన ప్రెస్‌మీట్‌లో తెలిపిన ప్రకారం అదే నిజమైంది. నాటకీయ పరిణామంలో బాపురెడ్డిని ఇటీవల స్టేషన్‌కు తీసుకొచ్చి కొద్ది సేపట్లోనే వదిలేయడంతో ఇలా అరెస్టు చేసి.. అలా వదిలేశారని ప్రజలంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కానీ, పోలీసులు మాత్రం విచారణ మాత్రమే చేశామని చెబుతుండడం అనుమానాలకు తావిస్తున్నది. కాగా, కీలక సూత్రధారిని అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారనే చర్చ ప్రజల్లో వినిపిస్తుండడం గమనార్హం.